


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 26-03-2026 | సంపుటి - 27 | సంచిక -303 | రూ : 4 | పేజీలు: 8


## రూ.586 కోట్లతో
# భద్రాచలం అభివృద్ధి...

- తొలి దశలో రూ.351 కోట్లతో ఆలయానికి సొబగులు
- గోదావరి ఘాట్ నుంచి టెంపుల్ కాంప్లెక్స్ వరకు..
- మొత్తం మూడు దశల్లో పనులు..
- ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: భద్రాచలం ఆలయం, పట్టణాన్ని మొత్తం మూడు దశల్లో రూ.586 కోట్ల వ్యయంతో అద్భుతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి దశ పనులను రూ.351 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనాపరమైన తరువాయి 2లో





2లో

## అక్కడక్కడ మూసివేత..
# అనేకచోట్ల నిరీక్షణ!

- చమురు సంస్థల ముందస్తు చెల్లింపు షరతుతో సమస్య
- తీవ్ర ఒత్తిడికి లోనైన పెట్రోల్ బంకులు
- హైదరాబాద్ సహా పలు జిల్లాలపై ప్రభావం
- ఆటోలకు ఎల్‌పీజీ సరఫరా రూ.500కే పరిమితం

2లో

# డిమాండ్ల యుద్ధం

- శాంతి చర్చలపై అమెరికా, ఇరాన్ చెరోదారి
- యుద్ధం నిలిపివేతకు 15 పాయింట్ల ప్రణాళికను రూపొందించిన అమెరికా
- పాక్ మధ్యవర్తిత్వంలో చేరవేత
- అది తమకు అంగీకారయోగ్యం కాదన్న ఇరాన్
- బాబ్ ఎల్‌మండబ్ జలసంధిపైనా దాడులు చేస్తామని హెచ్చరిక
- పశ్చిమాసియా వ్యాప్తంగా కొనసాగిన దాడులు

దుబాయ్: పశ్చిమాసియాలో పరిస్థితులు నానాటికీ మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇరాన్‌తో చర్చలకు ముందుకొచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. యుద్ధాన్ని నిలిపివేసేందుకు 15 పాయింట్ల ప్రణాళికను తాజాగా ఆ దేశం ముందుంచారు. అణ్వస్త్ర తయారీ ప్రణాళికలను టెహ్రాన్ ఉపసంహరించుకోవడం, అంతర్జాతీయ తరువాయి 2లో



# మనది దళారీ దేశం కాదు

- పాక్ మాదిరిగా వ్యవహరించలేం
- యుద్ధాన్ని ఆపాలని ట్రంప్‌నకు మోదీ చెప్పారు
- అఖిలపక్ష సమావేశంలో కేంద్రం వెల్లడి
- పశ్చిమాసియా పరిణామాలపై పార్లమెంటులో చర్చించాలన్న విపక్షం



దిల్లీ: మనది పాకిస్థాన్‌లాంటి దళారీ దేశం కాదని కేంద్ర సర్కారు వ్యాఖ్యానించింది. ఇరాన్‌పై అమెరికా చేస్తున్న యుద్ధాన్ని విరమింపజేయడానికి పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహిస్తోందన్న వార్తల్ని తోసిపుచ్చింది. పాకిస్థాన్‌ను 1981 నుంచి అమెరికా వాడుకుంటోందని, అందువల్ల మధ్యవర్తిత్వ ప్రయత్నాలను పాక్ చేయడంలో ఎలాంటి కొత్తదనం లేదని తేల్చిచెప్పింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల గురించి విపక్షాలకు చెప్పేందుకు బుధవారం సాయంత్రం పార్లమెంటు సముదాయంలో అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ మధ్యవర్తిత్వం వహించదని స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అన్ని వర్గాలనూ బాధిస్తున్న యుద్ధాన్ని సత్వరం ముగించాల్సిన అవసరం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారని ప్రభుత్వం ఈ సమావేశ వేదికగా వెల్లడించింది.

### మౌనంగా లేం.. స్పందిస్తున్నాం

యుద్ధంపై, దానిలో ఇరాన్ సర్వోన్నత నేతను హతమార్చడంపై ప్రభుత్వం మౌనంగా ఉందని విపక్షాలు చేస్తున్న ఆరోపణల్ని మంత్రులు తోసిపుచ్చారు. ప్రభుత్వం

తరువాయి 2లో

# విద్యుత్ ఛార్జీలు పెంచట్లేదు

- ట్రూఅప్ భారమూ ప్రజలపై వేయట్లేదు
- అవన్నీ భరించనున్న ప్రభుత్వం
- డిస్కంల రూ.15,790 కోట్ల రెవెన్యూ లోటు తీరుస్తామని లేఖ
- వాణిజ్య వినియోగదారులకు యూనిట్ రూ.12.25 నుంచి రూ.9.95కు తగ్గింపు
- పారిశ్రామిక కేటగిరీలోకి వాటర్ ప్లాంట్లు, ప్రింటింగ్ ప్రెస్‌లు
- 2026-27 టారిఫ్‌ను ఖరారు చేసిన ఏపీఈఆర్‌సీ



2లో

## విజయవాడ బైపాస్..
# నెలాఖరుకు పూర్తిగా సిద్ధం

- విద్యుత్ లైన్ కారణంగా అంబాపురం వద్ద వంతెన ఒక్కటే పెండింగ్
- మిగిలిన పనులన్నీ నెలాఖరుకు పూర్తి
- 27 నుంచి కాజ వద్ద బైపాస్‌లో ఇరువైపులా రాకపోకలకు అనుమతి

2లో





2లో

## సృజనాత్మక నగరంగా
# అమరావతి ఎదగాలి

- ఎకానమీని ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్దఎత్తున జరగాలి
- పర్యాటక రంగాభివృద్ధికి సీఎస్ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ
- పర్యాటకశాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

## రాజధాని రెండో దశకు
# మాస్టర్‌ప్లాన్

- సింగపూర్ సంస్థ సుర్బానా జురాంగ్‌కు బాధ్యతలు
- మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించనున్న ఆర్వీ అసోసియేట్స్
- గ్లోబల్ టెండర్ల ద్వారా ఎంపిక చేసిన సీఆర్‌డీఏ
- ఆరు నెలల్లో సిద్ధం చేయాలని గడువు
- తొలి దశలోనూ ఆ సంస్థలకే బాధ్యతలు
- ఆర్థిక ప్రణాళిక రూపొందించనున్న నైట్‌ఫ్రాంక్



2లో

# రూ.586 కోట్లతో భద్రాచలం అభివృద్ధి

హైదరాబాద్: భద్రాచలం ఆలయం, పట్టణాన్ని మొత్తం మూడు దశల్లో రూ.586 కోట్ల వ్యయంతో అద్భుతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి దశ పనులను రూ.351 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆలయం, పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. మొదటిదశలో గోదావరి ఘాట్ అభివృద్ధి, ఆలయ పరిసరాల విస్తరణ, మౌలిక వసతుల మెరుగుదల పనుల్ని చేపడతారు. ఇందుకోసం గోదావరి ఘాట్‌కు రూ.75 కోట్లు, ఆలయ సముదాయానికి రూ.180కోట్లు, పరిసరాల అభివృద్ధికి రూ.96 కోట్లు కేటాయించారు. రెండో దశలో ఆలయం సమీపంలో అభివృద్ధి పనులు, మూడో దశలో భద్రాచలం పట్టణ సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులు 2026లోనే మొదలవుతాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ఏడాది భద్రాచలం పర్యటనకు వెళ్లిన సందర్భంగా సమగ్ర అభివృద్ధికి హామీ ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

*** సీఎంకు కృతజ్ఞతలు: మంత్రి కొండా సురేఖ**

'భద్రాచలం ఆలయ అభివృద్ధి పనుల్ని ఆగమ శాస్త్రానికి అనుగుణంగా చేపడతాం. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, క్షేత్రవైభవాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్టుతో పర్యాటక రంగానికి కొత్త శోభ లభించడంతోపాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుంది. భారీ నిధులకు ఆమోదం తెలిపిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు' అని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# రాజధాని రెండో దశకు మాస్టర్‌ప్లాన్

విజయవాడ : రాజధాని అమరావతి రెండో దశకు మాస్టర్‌ప్లాన్‌తో పాటు, ఆర్థిక ప్రణాళికను కూడా ఒకేసారి సిద్ధం చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన బాధ్యతను సింగపూర్‌కు చెందిన సుర్బానా జురాంగ్ సంస్థకు అప్పగించింది. మౌలిక వసతుల ప్రణాళిక రూపకల్పనకు ఆర్వీ అసోసియేట్స్‌ను కన్సల్టెన్సీ సంస్థగా ఎంపిక చేసింది. ఆర్థిక ప్రణాళిక బాధ్యతను నైట్‌ఫ్రాంక్ కన్సల్టెన్సీ సంస్థకు అప్పగించింది. సీఆర్‌డీఏ ఇటీవల గ్లోబల్ టెండర్లు పిలిచి ఈ మూడు సంస్థల్ని ఎంపిక చేసింది. ఆరు నెలల్లో మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని గడువు విధించింది. రాజధాని తొలి దశకు మాస్టర్‌ప్లాన్, సీడ్ క్యాపిటల్ ప్లాన్, మొత్తం సీఆర్‌డీఏ ప్రాంతానికి ముసాయిదా ప్లాన్‌ను సుర్బానా జురాంగ్, తొలిదశ మౌలిక వసతుల ప్రణాళికను ఆర్వీ అసోసియేట్స్ సంస్థలే రూపొందించాయి. ఈ అనుభవం రెండో దశ మాస్టర్‌ప్లాన్‌ను వేగంగా, సమగ్రంగా రూపొందించేందుకు దోహదం చేస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

**అమరావతి తొలి దశకు కొనసాగింపు**

రాజధాని అమరావతి తొలి దశ మాస్టర్‌ప్లాన్‌ను నవ నగరాల కాన్సెప్ట్‌తో రూపొందించారు. 'వాక్ టు వర్క్' అన్న నినాదంతో హరిత, నీలి నగరంగా అమరావతిని సిద్ధం చేస్తున్నారు. మొత్తం రాజధాని ప్రాంతంలో 30 శాతం పైగా ప్రాంతంలో హరిత వనాలు, జలాశయాలు, కాలువలు అభివృద్ధి చేస్తున్నారు. రాజధానిలో మౌలిక వసతుల ప్రణాళికనూ అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించారు. విద్యుత్, తాగునీరు, మురుగునీరు, వర్షపునీటి పారుదల వ్యవస్థలు, ఐసీటీ కేబుళ్లు ఇవన్నీ భూగర్భంలోనే డక్టులలో వెళ్లేలా రహదారుల్ని నిర్మిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా విస్తరించే ప్రాంతాన్నీ తొలి దశతో అనుసంధానించేలా అదే స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్నది లక్ష్యం. ఏ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు, ప్రాజెక్టులు, డెవలప్‌మెంట్ నోడ్‌లు ఏర్పాటు చేయాలి వంటి స్పేషియల్ ప్లానింగ్‌తోపాటు, రవాణా, ట్రంక్‌రోడ్లు, తాగునీరు, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుత్ సదుపాయం వంటి మౌలిక వసతుల ప్రణాళికలను సిద్ధం చేస్తారు. ప్రస్తుతం భూసమీకరణ చేస్తున్న ఏడు గ్రామాలకు వివరణాత్మక మాస్టర్‌ప్లాన్‌తో పాటు, మిగతా 43 గ్రామాలకు సంబంధించిన స్ట్రక్చర్/ఇండికేటివ్ ప్లాన్‌ను సుర్బానా జురాంగ్ రూపొందిస్తుంది. రాజధాని రెండో దశలో భాగంగా స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ వంటివి ఏర్పాటు చేయబోతున్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు అనేక ప్రాజెక్టులు వస్తాయి. దానికి తగ్గట్టు ఇప్పుడే మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.

# విద్యుత్ ఛార్జీలు పెంచట్లేదు

అమరావతి, కర్నూలు: విద్యుత్ అదనపు ఛార్జీలు, ట్రూఅప్ భారాలు లేకుండా వివిధ కేటగిరీల వినియోగదారులకు 202627 ఆర్థిక సంవత్సరానికి వర్తించే విద్యుత్ టారిఫ్‌ను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఖరారు చేసింది. ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి చెబుతున్నట్లే ఏ ఒక్క కేటగిరీ వినియోగదారులపై ఛార్జీల భారం వేయకుండా రూపొందించిన టారిఫ్ ఆర్డర్‌ను కమిషన్ ప్రకటించింది. డిస్కంలు దాఖలు చేసిన ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్‌ఆర్)లో రూ.17,508.17 కోట్ల ఆదాయ లోటును ప్రతిపాదించాయి. ఆ లెక్కలు పరిశీలించిన కమిషన్ రూ.15,790.57 కోట్ల ఆదాయ లోటును అనుమతించింది. ఈ మొత్తాన్ని తామే భరిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌కు లేఖ అందించింది. రెవెన్యూ లోటును ప్రభుత్వం భరించకుంటే డిస్కంలు ఛార్జీలు పెంచాల్సి వచ్చేది. టారిఫ్ ఆర్డర్‌తో పాటు 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రూఅప్/ట్రూడౌన్ మొత్తాన్ని కమిషన్ సర్దుబాటు చేసింది. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రూఅప్ ఛార్జీల కింద రూ.638.68 కోట్లు వసూలుకు డిస్కంలు ప్రతిపాదించాయి. ఆ వివరాలను కర్నూలులోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో కమిషన్ ఛైర్మన్ పి.వి.ఆర్. రెడ్డి మీడియాకు వెల్లడించారు. 'ప్రభుత్వం బాధ్యతాయుతంగా తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా విద్యుత్తు ఛార్జీలు పెరగకపోగా.. కొన్ని కేటగిరీల వారికి విద్యుత్తు ఛార్జీలు తగ్గాయి. ఇది రాష్ట్రంలోని కోట్ల మంది ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుంది' అని పేర్కొన్నారు.

**వినియోగదారులకు దక్కే ప్రయోజనాలు**

* 2026..27 ఆర్థిక సంవత్సరంలో ఏ కేటగిరీ వినియోగదారులకూ విద్యుత్ ఛార్జీల పెంపు లేదు. 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రూఅప్ ఛార్జీల భారం కూడా వినియోగదారులపై పడదు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1.30 కోట్ల మంది గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.
* సుమారు 22 లక్షల మంది వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచిత విద్యుత్ సరఫరా అందుతుంది.
* ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీన వర్గాలకు చెందిన సుమారు 22 లక్షల మంది వినియోగదారులకు డీబీటీ కింద ఉచిత విద్యుత్/ విద్యుత్ టారిఫ్‌లో రాయితీ అందుతుంది.
* రాష్ట్రంలోని వాణిజ్య కేటగిరీ వినియోగదారులకు యూనిట్ ధరను రూ.12.25 నుంచి రూ.9.95కు తగ్గించింది. దీనివల్ల సుమారు 2 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది.
* కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితి 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంపు. దీనివల్ల సుమారు 18 వేల మంది చిన్న పరిశ్రమల యజమానులు విద్యుత్ టారిఫ్‌లో రాయితీ పొందుతారు.

# డిమాండ్ల యుద్ధం

దుబాయ్: పశ్చిమాసియాలో పరిస్థితులు నానాటికీ మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఇరాన్‌తో చర్చలకు ముందుకొచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. యుద్ధాన్ని నిలిపివేసేందుకు 15 పాయింట్ల ప్రణాళికను తాజాగా ఆ దేశం ముందుంచారు. అణ్వస్త్ర తయారీ ప్రణాళికలను టెహ్రాన్ ఉపసంహరించుకోవడం, అంతర్జాతీయ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని ఎప్పుడూ తెరిచి ఉంచడం వంటి కీలకాంశాలు అందులో ఉన్నాయి. అయితే ఆ ప్రణాళికను ఇరాన్ తిరస్కరించింది. తమపై ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం, గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ మూసివేయడం వంటి తమ డిమాండ్లను అంగీకరిస్తేనే యుద్ధం ఆపుతామని బదులివ్వడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి షాకిచ్చింది. 15 పాయింట్ల ప్రణాళికను ఇరాన్ తిరస్కరించినప్పటికీ.. చర్చలకు దారులు పూర్తిగా ఏమీ మూసుకుపోలేదని అమెరికా పేర్కొంది. మరోవైపు ఇరాన్‌పై వైమానిక దాడులను ఇజ్రాయెల్.. గల్ఫ్‌లో పొరుగు దేశాలపై దాడులను ఇరాన్ బుధవారమూ కొనసాగించాయి.

*** క్షిపణి, అణ్వాయుధ కార్యక్రమాలే లక్ష్యంగా..**

యుద్ధం నిలిపివేతకు రూపొందించిన 15 పాయింట్ల కాల్పుల విరమణ ప్రణాళికను.. మధ్యవర్తిత్వం జరుపుతామంటూ ముందుకొచ్చిన పాకిస్థాన్ ద్వారా ఇరాన్‌కు ట్రంప్ చేరవేశారు. ఆ ప్రణాళికలోని పూర్తి వివరాలు బహిర్గతం కాలేదు. అయితే ప్రధానంగా ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలు, అణ్వాయుధ తయారీ ప్రణాళికలను అడ్డుకోవడమే లక్ష్యంగా దాన్ని తయారుచేసినట్లు తెలుస్తోంది.

**ట్రంప్ ప్రణాళికలో కీలకాంశాలివీ..**

* అణ్వస్త్రాల తయారీలో తనకున్న సామర్థ్యాలను ఇరాన్ పరిత్యజించాలి. యురేనియం శుద్ధి ప్రక్రియను ఆపేయాలి. భవిష్యత్తులో అణ్వాయుధాలను తయారుచేయబోమని టెహ్రాన్ హామీ ఇవ్వాలి. ఇప్పటికే 60% శుద్ధిచేసిన సుమారు 450 కిలోల యురేనియాన్ని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)కు అప్పగించాలి.
* నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డోల్లోని ప్రధాన అణుకేంద్రాలను తొలగించాలి. ఆ ప్రాంతాల్లో తనిఖీల కోసం ఐఏఈఏకు పూర్తిస్థాయి ప్రవేశం కల్పించాలి.
* హర్మూజ్ జలసంధిని ఎప్పుడూ తెరిచే ఉంచాలి.
* టెహ్రాన్ తన అనుబంధ సాయుధ ముఠాలైన హెజ్‌బొల్లా, హమాస్, ఇరాకీ మిలిషియాలకు నిధులు, ఆయుధాల సరఫరాను నిలిపివేయాలి.
* ఇరాన్ తన అమ్ములపొదిలో ఉండే బాలిస్టిక్ క్షిపణుల సంఖ్య, వాటి పరిధిపై పరిమితులు విధించుకోవాలి.
* భవిష్యత్తులో క్షిపణులను స్వీయరక్షణ కోసం మాత్రమే ఉపయోగించుకోవాలి.
* ఒప్పందంపై చర్చించేందుకు వీలుగా నెల రోజులపాటు కాల్పుల విరమణ పాటించాలి.
* పై ప్రతిపాదనలకు అంగీకరిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ ఆంక్షలను అమెరికా పూర్తిగా ఎత్తివేస్తుంది. విద్యుదుత్పత్తి వంటి పౌర అణు కార్యక్రమాల్లో టెహ్రాన్‌కు అండగా నిలుస్తుంది. బుషెహర్ ప్లాంట్‌లోనూ విద్యుదుత్పత్తికి సహాయం చేస్తుంది.
*

# సృజనాత్మక నగరంగా అమరావతి ఎదగాలి

అమరావతి: అమరావతి ప్రాంతం సృజనాత్మక నగరం (క్రియేటివ్ సిటీ)గా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. క్రియేటివ్ ఎకానమీని ప్రోత్సహించేందుకు వివిధ అంశాల్లో కంటెంట్ క్రియేషన్ పెద్దఎత్తున జరగాలని పేర్కొన్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ కూడా సృజనాత్మక ఆర్థిక ప్రాజెక్టు (క్రియేటివ్ ఎకానమీ) ఏర్పాటుకు ఆసక్తి చూపించారని వివరించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటకశాఖపై ఆ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి సీఎం సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. 'గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో 10 వేలకుపైగా హోం స్టేలు రావాలి. వాటి నిర్వహణకు రేటింగ్ పెట్టాలి. వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటళ్లు వచ్చేలా చూడాలి. అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాల్లో 1015 కారవాన్ పార్కులు ఏర్పాటుచేయాలి. ఎక్స్‌పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలి' అని సీఎం ఆదేశించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

**విశాఖ, కృష్ణపట్నం పోర్టుల్లో క్రూజ్‌లు**

'శ్రీశైలం, గండికోట, కంభంచెరువు లాంటిచోట్ల వాటర్ ఏరోడ్రోమ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలి. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్‌లు నడిపేలా చూడాలి. గోదావరి పుష్కరాల నాటికి వెయ్యి టెంట్‌సిటీలు అందుబాటులోకి తేవాలి. కేంద్రం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీం కింద విశాఖపట్నం, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలి.

*** విశాఖ, తిరుపతిలో ఎమ్యూజ్‌మెంట్ పార్కులు**

విశాఖపట్నం, తిరుపతిలో ఎమ్యూజ్‌మెంట్ పార్కుల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల్లో వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధి ప్రాజెక్టులు ఈ ఏడాది మే నాటికి సిద్ధం చేయాలి. రాజమహేంద్రవరంలో గోదావరి పుష్కరఘాట్ పనులు ఆగస్టు, హేవ్‌లాక్ వంతెనపై పర్యాటకులను అనుమతించే పనులు ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తిచేయాలి.

*** సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి**

సూర్యలంక బీచ్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలి. తిరుపతిలో చెరువులు, అమరావతి ప్రాంతంలో కాలువలు, విశాఖసహా వేర్వేరు ప్రాంతాల సుందరీకరణకు చర్యలు చేపట్టాలి' అని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల్లో ప్రస్తుతం చేపడుతున్న ప్రాజెక్టులతోపాటు అదనంగా మరో రూ.663 కోట్లకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సీఎంకు వివరించారు. పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**సృజనాత్మక నగరం అంటే?**

కళలు, సంస్కృతి, డిజైన్, సంగీతం, సినిమా, ఆహారం.. ఇలా పలు రంగాల్లో ప్రత్యేక గుర్తింపు, వీటిలో ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు చేసేవే సృజనాత్మక నగరాలు. వీటిని యునెస్కో గుర్తించనుంది. ఉదాహరణకు ముంబై భారీ సినీ పరిశ్రమగా, చెన్నై కర్ణాటక సంగీతానికి కేంద్రంగా, వారణాసి చేనేతలు, హస్తకళలకు ప్రసిద్ధిగా నిలిచాయి. ఇలాగే రాజధాని అమరావతి ప్రాంతాన్ని వినోద, సమాచార కంటెంట్, ఇతర రంగాల్లో తయారీ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# విజయవాడ బైపాస్.. నెలాఖరుకు పూర్తిగా సిద్ధం

అమరావతి: విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా.. కోల్‌కతాచెన్నై హైవే 16లో వెళ్లే వాహనాలు నగరంలోకి రావాల్సిన అవసరం లేకుండా.. విజయవాడ బైపాస్ నెలాఖరుకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాబోతోంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు ముగింపు పనులు చేస్తున్నారు. ఈ బైపాస్ 47 కి.మీ. ఉండగా, ఇందులో చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కి.మీ., గొల్లపూడి నుంచి కాజ వరకు 17 కి.మీ. చొప్పున రెండు ప్యాకేజీలుగా పనులు చేశారు.

*** చిన్నఅవుటపల్లి వద్ద బైపాస్ అనుసంధాన పనులు**

చిన్నఅవుటపల్లిగొల్లపూడి మధ్య కొంతకాలంగా వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. చిన్నఅవుటపల్లి వద్ద బైపాస్‌ను హైవేలోకి అనుసంధానం చేసే పనులు పూర్తికాకపోవడంతో పక్కన ఉన్న స్లిప్‌రోడ్‌లో నుంచి వాహనాలను పంపిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే నేరుగా బైపాస్‌లోకి వెళ్లొచ్చు. బీబీ గూడెం వద్ద వంతెన రిటైనింగ్‌వాల్ గత ఏడాది వర్షాలకు దెబ్బతినడంతో, అక్కడ పునర్నిర్మాణ పనులు చేస్తున్నారు. దాంతో అక్కడా స్లిప్‌రోడ్‌లో నుంచి వాహనాలు వెళ్తున్నాయి. ఈ పనులు నెలాఖరుకు పూర్తికానున్నాయి.

**వంతెనకు విద్యుత్ లైన్ వివాదం**

అంబాపురం వద్ద ల్యాంకో పవర్‌కు చెందిన హెచ్‌టీ విద్యుత్‌లైన్ కారణంగా వంతెన పూర్తికాలేదు. అక్కడ వంతెన నిర్మించి, వాహనాలను అనుమతిస్తే.. భారీ వాహనాలకు విద్యుత్‌లైన్లు తగిలే ప్రమాదం ఉంది. దీంతో వంతెన నిర్మాణం ఆపేశారు. హెచ్‌టీ లైన్‌కు సంబంధించి బైపాస్‌కు ఇరువైపులా రెండు ఎత్తైన టవర్లు నిర్మించి, వాటిలోకి విద్యుత్‌లైన్లు మార్చాలి. ఇలా మార్చినప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, పవర్ షట్‌డౌన్ చేయాలని, దీనికి ముందే పరిహారం చెల్లించాలని ల్యాంకో పవర్ కోరుతోంది

# మూసీ ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం

హైదరాబాద్: ఇంధన కొరత భయంతో వాహనదారులు ఒకవైపు పెట్రోల్ బంకుల్లో బారులు తీరుతూ ట్యాంక్‌ఫుల్ అంటుంటే... మరోవైపు ముందస్తు చెల్లింపులు చేస్తేనే డీజిల్, పెట్రోల్ సరఫరా చేస్తామంటూ చమురు సంస్థలు షరతు విధించడంతో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి క్లిష్టంగా మారింది. ఫలితంగా అక్కడక్కడ పెట్రోల్ బంకులను మూసివేయగా, చాలాచోట్ల తెరిచి ఉన్న వాటిపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఈ సమస్య తీవ్రత హైదరాబాద్‌లో అధికంగా కనిపించగా, జిల్లాల్లోనూ ప్రభావం పడింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు రద్దీ ఎక్కువ ఉండగా సాయంత్రానికి కొంత తగ్గింది. ఇక ఆటోలకు వాడే ఎల్పీజీకి కొరత ఏర్పడుతోంది. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో ఓ బంకు దగ్గర కిలోమీటర్ దూరం ఆటోలు బారులు తీరగా... అక్కడ గ్యాస్ పరిమితిని గరిష్ఠంగా రూ.500కు పరిమితం చేశారు.

**కంపెనీల అనూహ్య నిర్ణయం**

ఇప్పటివరకు చమురు సంస్థల మధ్య వ్యాపార పోటీతో బంకుల యజమానులకు ముందస్తుగా పెట్రోల్, డీజిల్ సరఫరా చేసేవి. ఇంధనం అన్‌లోడ్ చేశాక డబ్బులు తీసుకునేవి. ఒక్కో ట్యాంకర్‌కు యజమాని సగటున రూ.13.5 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు బంకులు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో ఆయా సంస్థలు ఫోన్‌లో ఆర్డర్ పెడితే ట్యాంకర్లు పంపే విధానానికి స్వస్తి పలికి.. డబ్బులు చెల్లించాకే పంపిస్తున్నాయి. అదికూడా ఐదారు గంటల తర్వాతే ట్యాంకర్లు బయల్దేరుతున్నాయి. ఈ ఆలస్యం సరఫరాపై ప్రభావం



చూపిస్తోందని కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ డీలర్ తెలిపారు. హైదరాబాద్, కరీంనగర్ వంటిచోట్ల యజమానులు గ్రానైట్, ఇసుక క్వారీలకు, వివిధ సంస్థలకు పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేసి కొన్ని రోజులయ్యాక డబ్బులు తీసుకుంటారు. తర్వాత చమురు సంస్థలకు చెల్లించేవారు. ఆయిల్ కంపెనీల తాజా నిర్ణయంతో పలువురు యజమానులకు డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో బంకులను మూసేశారు. దీంతో సమీపంలోని బంక్‌లపై ఒత్తిడి హఠాత్తుగా పెరిగింది.

**ట్యాంక్ ఫుల్‌తోపాటు డబ్బాల్లోనూ...**

కరీంనగర్ జిల్లాలో 150కిపైగా బంకులుంటే 20 వరకు మూసివేశారు. కరీంనగర్‌కు రామగుండం, వరంగల్‌ల నుంచి పెట్రోల్ వస్తుంది. అక్కడ నిల్వలు సరిపడా ఉన్నా కంపెనీల నిబంధనలతో సరఫరా మునుపటిలా జరగడం లేదు.

# జిహాద్ కోసం 'అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్'

అమరావతి: యువతలో ఉగ్రవాద భావజాలాన్ని పెంపొందించటం, వారిని జిహాద్ కోసం సన్నద్ధం చేయటమే లక్ష్యంగా విజయవాడకు చెందిన యువకులు మహమ్మద్ రహమతుల్లా షరీఫ్, మీర్జా సొహైల్ బేగ్, మహమ్మద్ దానిష్‌లు కలిసి 'అల్ మాలిక్ ఇస్లామిక్ యూత్' పేరిట ఓ గ్రూపు ఏర్పాటు చేసుకున్నారని కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం (సీఐ సెల్) తేల్చింది. వీరు నిషేధిత ఉగ్రవాద సంస్థలైన అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్ కాంటినెంట్ (ఏక్యూఐఎస్), ఐసిస్‌తో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించింది. విదేశాల్లోని హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు 'భారత్‌పై యుద్ధం' (గజ్వాఏహింద్) కోసం వీరు పనిచేస్తున్నట్లు నిర్ధారించింది. దేశవ్యాప్తంగానూ పలు రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ విస్తరించినట్లు తేల్చింది. వీరు ముగ్గురూ ఉగ్రవాద శిక్షణ పొందడానికి నెల రోజుల్లోగా పాకిస్థాన్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు గుర్తించింది. విజయవాడలోని వేర్వేరు ప్రాంతాల్లో వీరి ముగ్గుర్నీ సోమవారం అదుపులోకి తీసుకుంది. సీఐ సెల్ దర్యాప్తులో గుర్తించిన అంశాలివి.

**విద్వేషపూరిత ప్రసంగాలు చూసి..**


విజయవాడలో ఓలా, ర్యాపిడో బైక్ డ్రైవర్‌గా పనిచేసుకునే మహమ్మద్ రహమతుల్లా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల నాయకుల విద్వేషపూరిత ప్రసంగాల వీడియోలు చూస్తూ ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షితుడయ్యాడు. ఉగ్రవాద సంస్థల సామాజిక మాధ్యమ ఖాతాల్ని అనుసరించటంతో పాటు ఉగ్రవాద కార్యకలాపాల వీడియోలు పోస్టు చేసేవాడు.

# కొత్తగూడెం సబ్ డివిజిన్ వ్యాప్తంగా పకడ్బందీగా ట్రాఫిక్ నియమాలు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో కొత్తగూడెం సబ్ డివిజనల్ వ్యాప్తంగా ట్రాఫిక్ కంట్రోల్ లో భాగంగా బారికేడ్లలను ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా మరమ్మతులకు గురై సరిగా వినియోగించని బరకేడ్లను మరమ్మతులు చేపట్టి, రంగులు వేసి నూతన బారికేడ్లగ మార్చిన పోలీసులు వాటిని ఇప్పుడు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నారు. పలు పండుగలు, కార్యక్రమాలు వచ్చినప్పుడు వాహనాలు ఇష్టానుసారంగా వెళ్తుండడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల అనుసారం ట్రాఫిక్ నియమాలను పటిష్టం చేయనున్నారు. దీనికి అవసరం అయ్యే అన్ని రకాల ఈక్విప్మెంట్లను పోలీసులు సిద్ధం చేశారు. మధ్యతరహా, భారీ సైజ్ ఉండే బారికేడ్లను సిద్ధం చేసిన పోలీసులు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఆయా చోట్లకు వాటిని తరలించి వాటిని ఏర్పాటు చేసేందుకు సర్వం సిద్ధం చేశారు.

# గంజాయి సేవిస్తున్న ఇద్దరు అరెస్ట్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రశాంతినగర్‌లోని సమ్మక్కసారక్క గద్దెల సమీపంలో గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు.కొత్తగూడెం టూ టౌన్ సీఐ ప్రతాప్ ఆదేశాల మేరకు ఎస్ఐ మనీషా సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పరారయ్యేందుకు యత్నించగా, వెంటనే వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి వారి వద్ద నుంచి సుమారు 95 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేసిన వారిని షేక్ జానీ పాషా, బోడ విష్ణువర్ధన్‌లుగా గుర్తించారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి, బుధవారం కొత్తగూడెం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు తరలించారు.

# బూర్గుల గ్రామం లో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రోగ్రాం జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితా దేవి,డాక్టర్ . పాపారావు అదనపు జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి ప్రారంభించారు.దానిలో భాగంగా ఈరోజు బూర్గుల ప్రైమరీ హెల్త్ సెంటర్ బూర్గుల విలేజిలో క్యాంపు నిర్వహించడం జరిగింది . ఈ క్యాంపుకు బూరుగుల ప్రజలందరూ వచ్చి రక్త పరీక్షలు, గల్ల పరీక్షలు, ఎక్సరేలు పరీక్షలు నిర్వహించారు. క్యాంపుకు ప్రజలంతా వచ్చి విజయంతం చేశారు. ఈ క్యాంపులో డిప్యూటీ డిఎంహెచ్ఓ విజయలక్ష్మి, పీహెచ్ సి డాక్టర్ రఘురాం , శ్రీనివాసరెడ్డి, జయేందర్,వెంకటముని,సలాం కహన్ ల్యాబ్ టెక్నీషియన్ ,రెడ్డి నాయక్ హెల్త్ అసిస్టెంట్ , రవికుమార్.గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్, వార్డ్ నెంబర్లు గ్రామ ప్రజలు ఏ.ఎన్.ఎమ్., ఆశాలు అందరు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంధాలయానికి కార్పొరేటర్ సుప్రియ పుస్తకాల వితరణ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర గ్రంధాలయానికి కొత్తగూడెం 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ పుస్తకాలను వితరణగా అందించారు. ప్రజా పాలన - ప్రగతి పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం జిల్లా గ్రంధాలయంలో రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ ఆదేశాల జిల్లా లైబ్రరీ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆధ్వర్యంలో 'గ్రంథాలయ పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ విద్యా చందన, డిఎస్పి ఆదినారాయణ, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ నాగ సీతారాములు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుప్రియ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగుల కోసం పలు పుస్తకాలతోపాటు సాహిత్య పుస్తకాలను వితరణగా అందించారు. ముఖ్య అతిధులు మాట్లాడుతూ గ్రంథాలయం యొక్క గొప్పతనం, ప్రభుతం వాటి రక్షణకి చేస్తున్న కృషి, నిరుద్యోగులకు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్పొరేటర్ సుప్రియ పుస్తకాలు వితరణగా అందించడాన్ని అభినందించారు. అనంతరం గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

# భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

* మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందించిన సిపిఎం ప్రతినిధి బృందం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: భద్రాచలం అభివృద్ధికి నిధులు కేటాయించి భద్రత, భరోసా ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సిపిఎం ప్రతినిధి బృందం బుధవారం వినతిపత్రం అందజేసింది. భద్రాచలం పట్టణాన్ని పోలవరం ముంపు నుండి కాపాడేందుకు కరకట్ట పునఃనిర్మాణ పనులను వెంటనే చేపట్టి పట్టణానికి భద్రత కల్పించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలలోనే ఐదు గ్రామపంచాయతీల విలీనంపై తీర్మాణం చేయాలన్నారు. శ్రీరామనవమి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు భద్రాచలం పర్యటనకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కేవలం పర్యటనకే పరిమితం కాకుండా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తగినన్ని నిధులు కేటాయించి త్వరితగతిన ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలన్నారు. మాడవీధుల అభివృద్ధిలో స్థలాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద అధికారులు హామీ ఇచ్చిన ప్రకారం ఇంటి స్థలాలను శ్రీరామనవమి రోజునే ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ చేయాలనీ విజ్ఞప్తి చేశారు. భద్రాచలం కేంద్రంగా ప్రభుత్వ ఇసుక రీచ్‌ను ప్రారంభించి పట్టణ ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం నుండి వెంకటాపురం వరకు వంద కిలోమీటర్ల మేర రహదారులు పూర్తిగా ధ్వంసం అయిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి శ్రీరామ నవమి రోజునే పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినిధి బృందంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ లు ఉన్నారు.

# రహదారి భద్రత.. జీవితానికి రక్షణ: తిరందాసు జగన్నాథం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వాహనదారులు రహదారిపై ప్రయాణించేటప్పుడు రహదారి నిబంధనలు పాటిస్తూ జీవితాన్ని రక్షించుకోవాలని లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షుడు తిరందాసు జగన్నాథం సూచించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై వాహనాదారులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐలు ఆంజనేయులు, సైదిరెడ్డి పాల్గొని వాహనాదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. నిర్ణీత వేగ పరిమితులను పాటించాలని, మలుపుల వద్ద వేగం తగ్గించాలన్నారు. మద్యపానం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు రవాణా శాఖలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ కార్యదర్శి ఎండి అతహర్ పాష, కోశాధికారి సిలివేరు మంగయ్య, ట్రాఫిక్ కానిస్టేబుల్ జగన్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి వాహనదారులు పాల్గొన్నారు.

# గూడెం'లో 'కళ' తప్పిన నవమి

* సుంధరీకరణపై అధికారుల నిర్లక్ష్యం
* భద్రాచలం వెళ్లే భక్తులకు దారిచూపని 'గూడెం'



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:ప్రతీయేటా శ్రీ రామ నవమి వచ్చిందంటే కొత్తగూడెం పట్టణం సుందరంగా ముస్తాబు అయ్యేది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణం, శ్రీరాముడి పట్టాభిషేకం మహోత్సవాన్ని వీక్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రోడ్డు మార్గంలో భద్రాచలం వెళ్తుంటారు. ముఖ్యంగా హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కొత్తగూడెం పట్టణం మీదుగా భద్రాచలం వెళ్తారు. అయితే శ్రీరామ నవమికి వారంరోజుల ముందు నుంచే రోడ్డు మార్గంలో కొత్తగూడెం పట్టణం మీదుగా భద్రాచలం వెళ్లే భక్తులకు కనులకు ఇంపుగా ఉండే విధంగా సుందరంగా తీర్చిదిద్దేవారు. జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్లకు నలుపు, తెలుపు చారలతో పెయింటింగ్ వేయడం, లక్ష్మీదేవిపల్లి వంతెన, ప్రధాన కూడళ్లలోని సర్కిళ్లు, పక్కన ఉండే సర్కిల్ పార్క్లకు పెయింటింగ్ వేయడమే కాకుండా ట్రీ కటింగ్ నిర్వహించేవారు. కాని ఈ ఏడాది మాత్రం సుందరీకరణపై అధికారులు దృష్టి పెట్టకపోవడం పట్ల పట్టణవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదా.. లేక కావాలనే శ్రీరామ నవమి వేడుకలను నిర్లక్ష్యం చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పోస్టాఫీస్ సెంటర్‌లో ఉన్న సర్కిల్‌కు మాత్రం సున్నం వేసి వదిలేయడం గమనార్హం. పెయింట్ వేయాల్సిన స్థానంలో సున్నం వేయడంపై తీవ్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రతీ ఏటా ఒక్కసారి శ్రీరామనవమి సందర్భంగా పట్టణాన్ని ముస్తాబు చేసే ప్రభుత్వ యంత్రాంగం ఈసారి పట్టించుకోకపోవడంతో పట్టణం కళావిహీనంగా కన్పిస్తోందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో

## రెండు బంగారు పతకాలను సాధించిన మహిళా కానిస్టేబుల్ సుష్మ

* అభినందించిన ఎస్పీ రోహిత్ రాజు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తిసున్న మహిళా పోలీసు కానిస్టేబుల్ డి.సుష్మ 100 మీటర్లు,200 మీటర్లు పరుగు పందెం విభాగాలలో బంగారు పతకాలను సాధించారు.విశేష ప్రతిభ కనబరచి పంజాబ్ లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో ఐదవ స్థానంలో నిలిచిన సుష్మ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.గెలుపోటములు సహజమని,మెరుగైన ప్రదర్శన ఇవ్వడానికి కృషి చేయాలని,ఓటమి చెందిన వారు నిరాశ చెందకుండా భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.


# బీఎస్పీ పార్టీ పోస్టర్ ఆవిష్కరణ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : బీఎస్పీ పార్టీ ఆవిష్కరణ సందర్భంగా బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్లో బి ఎస్పి నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రాబోయే ఏప్రిల్ 14 మహానేత డాక్టర్ .బి.ఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులను కోరారు రాష్ట్ర జనరల్ సెక్రటరీ పార్లమెంట్ చీఫ్ జోన్ ఇంచార్జి ప్రభు కుమార్ , రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఉమ్మడి జిల్లా ఇంచార్జి శ్రీకాంత్ మంచాల , నల్గొండ పార్లమెంటు ఇంచార్జి వంటెపాక యాదగిరి భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి కత్తుల కాన్షీరామ్ బొడ్డు కిరణ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు రావులపాటి రవిశంకర్ ,జిల్లా వైస్ ప్రెసిడెంట్ శివ , మరియు జిల్లా నాయకులు, నియోజకవర్గ ఇంచార్జీలు, నియోజకవర్గ అధ్యక్షులు, సెక్టార్ నాయకులు, సీనియర్ నాయకులు బూత్ స్థాయి నాయకులు పాల్గొన్నారు.




# సకల మానవాళికి ఆదర్శ దంపతులు శ్రీ సీతారాములు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట : సకల మానవాళికి ఆదర్శ దంపతులు శ్రీ సీతారాములు అని శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తెలిపారు. ఈ నెల 27 శుక్రవారం శ్రీ రామనవమి ని పురస్కరించుకొని సూర్యాపేట శ్రీ సంతోషిమాత దేవాలయంలో జరుగు శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం లో కల్యాణ తలంబ్రాల కొరకు బియ్యపు గింజలపై శ్రీరామ అని వ్రాసిన బియ్యాన్ని శ్రీ సంతోషిమాత దేవాలయం అధ్యక్షులు బ్రాహ్మాండ్లపల్లి మురళీధర్ కు బుదవారం దేవాలయం లో అందజేశారు.ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ కు చెందిన వందన,అనిత అనే భక్తులు గత 2 నెలలు గా సుమారు 3 కిలోల బియ్యం పై శ్రీ రామ అని వ్రాసిన బియ్యం రాష్ట్ర వ్యాప్తంగా పలు దేవాలయాల్లో అందజేస్తున్నట్లు తెలిపారు.అందులో భాగంగా శ్రీ వాసవి సేవా సమితి సభ్యులు చిల్వ నాగభూషణం ద్వారా సేకరించిన బియ్యం శ్రీ సంతోషిమాత దేవాలయం కు అందజేసినట్లు తెలిపారు. ఎంతో సూక్ష్మమైన బియ్యపు గింజల పై శ్రీ రామ అని వ్రాయడము వారి అమిత భక్తికి నిదర్శనం అన్నారు.శ్రీ రామ అని నామము పలుకుతేనే సర్వ పాపాలు తొలిగి పోతాయి అని ఎంతో పవిత్ర మైన నామము శ్రీరామ నామం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు అశోక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# ఫిన్లాండ్ లో విద్యా ప్రమాణాల అధ్యాయనానికి వెళ్ళున్న కిష్టాపూర్ ఉపాధ్యాయుడు



ప్రజాస్ఫూర్తి, జన్నారం : విదేశీ విద్యా ప్రమాణాల అధ్యయనం చేయుటకు, అత్యుత్తమ విద్య బోధనను అధ్యయనం కోసం జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఉపాధ్యాయులను ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ విజిట్స్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం ఫర్ టీచర్స్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది ఉపాధ్యాయులను ఫిన్లాండ్ దేశం పంపించడానికి ఎంపిక చేసింది . అందులో మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల లో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న దాముక కమలాకర్ ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, ఉపాధ్యాయ బృందం కమలాకర్ ను పాఠశాలలో బుధవారం అభినందించారు. వచ్చే ఏప్రిల్ 20వ నుంచి 24వ వరకు ఫిన్లాండ్ దేశంలో ఆయన పర్యటించనున్నారు. అక్కడ అత్యుత్తమ విద్య బోధనలు పరిశీలించి విద్యా బోధన మెళుకువలు తెలుసుకొనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, గ్రామ సర్పంచ్ వాసాల నరేష్, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్పర్సన్ మంగ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాడి మురళి, గోవర్ధన చారి, కొట్టే రాజన్న, బుచ్చి లింగయ్య బి ప్రకాష్,నగేష్, మణెమ్మ,జ్యోతిశీల, అశోక్, నరహరిశర్మ,వాసు, కాంతయ్య, శ్రీనివాస్, రజిత రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకాల ఆన్ లైన్ దరఖాస్తు గడవు పొడిగింపు




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం లి"మహబూబాబాద్ జిల్లా ద్వారా 2025 26 సం.నకు స్వయం ఉపాధి పథకాలకై ఆన్ లైన్ దరఖాస్తు గడువు ఏప్రిల్ 02 వరకు పొడిగించనైనదని ఎస్సీ కార్పోరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన షెడ్యూల్డ్ కులములకు చెందిన యువతీ/యువకులు సంబందిత కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, ఆదార్ కార్డు,రేషన్ కార్డు, పాస్ పోర్ట్ సైజు ఫోటో, పట్టాదారు పాసు పుస్తకం (వ్యవసాయ రంగం యూనిట్లకు), శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు (రవాణా రంగం యూనిట్లకు) తదితర దృవ పత్రాలతో ఏప్రిల్ 02 వరకు ఆన్ లైన్ లో నమోదు చేసుకోగలరని ఇట్టి పథకముల వివరాల కోసం (www.tgobmms.cgg.gov.in), వెబ్ సైట్ ని సందర్శించగలరని. ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సి నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోగలరని ఈ సందర్భంగా అధికారి కోరారు.

# వరంగల్ మహానగరానికి రూ.1,040 కోట్ల భారీ బడ్జెట్.. గ్రేటర్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం!

* వరంగల్ ట్రై-సిటీస్ అభివృద్ధికి గ్రేటర్ మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం
* 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,040.58 కోట్లతో ముసాయిదా బడ్జెట్ రూపకల్పన
* పన్నుల ద్వారా రూ.349.19 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా రూ.685.20 కోట్ల ఆదాయం అంచనా
* మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలపై ప్రధాన దృష్టి సారించినట్లు మేయర్ గుండు సుధారాణి వెల్లడి




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ బుధవారం నాడు కీలక నిర్ణయం తీసుకుంది. హనుమకొండలోని కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 1,040.58 కోట్లతో రూపొందించిన ముసాయిదా బడ్జెట్‌ను ఆమోదించింది. మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ట్రైసిటీస్ (వరంగల్, హనుమకొండ, కాజీపేట) అభివృద్ధి కోసం రూపొందించిన ఆర్థిక అంచనాలకు మెజారిటీ సభ్యులు ఆమోదముద్ర వేశారు.

**ఆదాయం అంచనాలు ఇలా..**

* ఈ ముసాయిదా బడ్జెట్‌ను మున్సిపల్ అకౌంట్స్ ఆఫీసర్ శివలింగం సభలో ప్రవేశపెట్టారు. పన్నులు, గ్రాంట్ల ద్వారా సమకూరే ఆదాయంపై కౌన్సిల్ ముందు స్పష్టమైన నివేదికను ఉంచారు. మొత్తం రూ.1,040.58 కోట్ల బడ్జెట్‌లో ప్రధానంగా:
* సాధారణ పన్నుల ద్వారా ఆదాయం: రూ.349.19 కోట్లు
* ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా ఆదాయం: రూ.685.20 కోట్లు
* డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా ఆదాయం: రూ.6.20 కోట్లు వస్తుందని అంచనా వేశారు.

**మౌలిక సదుపాయాలే లక్ష్యంగా..**

వచ్చే ఆర్థిక సంవత్సరం నగరంలో పట్టణ మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఈ బడ్జెట్ కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయి. ఈ సందర్భంగా మేయర్ సుధారాణి మాట్లాడుతూ.. సమర్థవంతమైన పన్నుల వసూళ్లతో పాటు నగర అభివృద్ధికి ఈ బడ్జెట్ పెద్దపీట వేస్తుందన్నారు. ఈ బడ్జెట్ ఆమోదంతో ట్రైసిటీస్ పరిధిలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు కార్పొరేషన్‌కు మార్గం సుగమమైందని ఆమె పేర్కొన్నారు. ఈ కీలక కౌన్సిల్ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, పలువురు కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఫిరాయింపు ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు పార్టీ మారలేదన్న ఏడుగురు ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్‌కు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు వెలువరించారు. దీనిని సవాల్ చేస్తూ పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిని విచారించిన న్యాయస్థానం కౌంటర్ దాఖలు చేయాలని స్పీకర్‌తో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, తెల్లం వెంకట్రావులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసింది.



## టీజీపీఎస్సీ అభ్యర్థులకు అలర్ట్.. OTR అప్‌డేట్ గడువు పొడిగింపు..!

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. వన్ టైమ్ రిజిస్ట్రేషన్ (OTR) వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు అభ్యర్థులకు తుది అవకాశం కల్పించింది. వాస్తవానికి ఈ అప్‌డేట్ గడువు మార్చి 25, 2026తో ముగియాల్సి ఉంది. అయితే అభ్యర్థుల సౌకర్యార్థం ఈ తుది గడువును ఏప్రిల్ 10, 2026 వరకు పొడిగిస్తూ టీజీపీఎస్సీ సెక్రటరీ అధికారికంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు.

**OTR అప్‌డేట్ ఎందుకు తప్పనిసరి?**

రాబోయే నియామక నోటిఫికేషన్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి, అభ్యర్థుల డేటాలో తప్పులు లేకుండా చూడటానికి, ఫలితాలను త్వరగా ప్రకటించడానికి TGPSC ఈ OTR అప్‌డేట్ ప్రక్రియను చేపట్టింది. నిర్ణీత సమయంలోగా OTR అప్‌డేట్ చేసి, సంబంధిత సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసిన వారు మాత్రమే భవిష్యత్తులో టీజీపీఎస్సీ జారీ చేసే ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. కాబట్టి అధికారిక వెబ్‌సైట్ www.tgpsc.gov.in ద్వారా అభ్యర్థులు తమ వివరాలను తక్షణమే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

* **అభ్యర్థులు గమనించాల్సిన ముఖ్య నిబంధనలు**
* పాత అభ్యర్థులకు సూచన: ఇప్పటికే రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా తమ పాత OTR వివరాలను అప్‌డేట్/ఎడిట్ చేయాలి, సంబంధిత డాక్యుమెంట్లను సూచించిన గడువులోగా అప్‌లోడ్ చేయాలి. పాత అభ్యర్థులు మళ్లీ కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతి లేదు.
* కఠిన చర్యలు: ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నకిలీ (డూప్లికేట్) అప్లికేషన్లు సృష్టించే ప్రయత్నం చేస్తే.. దానిని డేటా ట్యాంపరింగ్‌గా పరిగణించి తగిన చర్యలు తీసుకుంటారు.
* కొత్త అభ్యర్థులకు వెసులుబాటు: మొదటిసారిగా (కొత్తగా) రిజిస్టర్ చేసుకునే అభ్యర్థులకు మాత్రం గడువు ముగిసిన తర్వాత కూడా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

అదనపు అర్హతలు ఉంటే: అదనపు విద్యార్హతలు సాధించిన అభ్యర్థులు, ఆ వివరాలను OTR అప్లికేషన్‌లోని "Editable Tab" ద్వారా అప్‌డేట్ చేసుకునే సదుపాయం ఉంటుంది.

**మళ్లీ గడువు పెంచరు**

ఏప్రిల్ 10వ తేదీని ఆఖరి అవకాశంగా భావించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ గడువు పొడిగించే ప్రసక్తే లేదని కమిషన్ తేల్చి చెప్పింది. ఈ సూచనలు పాటించని వారు రాబోయే నోటిఫికేషన్లకు అనర్హులుగా మిగిలిపోతారని స్పష్టం చేసింది. కాబట్టి అభ్యర్థులు దీనిని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని అనర్హత వేటు పడకుండా వెంటనే OTR అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది.




## ఈసారైనా ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష నిర్వహించండి.. మంత్రి పొంగులేటిపై స్పీకర్ ఆగ్రహం

హైదరాబాద్ : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై స్పీకర్ ప్రసాద్ కుమార్ అసెంబ్లీ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారైనా ఇందిరమ్మ ఇండ్లపై విపక్షాలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. తాను గతంలోనే ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని చెప్పినట్లు గుర్తుచేశారు. తన సూచనలను మంత్రి పొంగులేటి పట్టించుకోలేదన్నారు. తన సూచనలు పాటించి సమీక్షించి ఉంటే ఇన్ని ప్రశ్నలు వచ్చేవి కాదన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై శాసన సభ్యుల ప్రశ్నల నేపథ్యంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. సభలో ఉన్న సభ్యులందరూ అధికార పక్షం కానీ, విపక్షాలు కానీ.. ఈ ప్రశ్న అడగాలనుకుంటున్నారు. మీకు ఇంతకుముందు సెషన్‌లో కూడా చెప్పాను.. అందరినీ పిలిచి అసెంబ్లీలో సమావేశం ఏర్పాటు చేయాలని. అలా చేసి ఉంటే ఈ అవకాశం దొరకుండేది. ఈసారైనా అసెంబ్లీ కాగానే అందరినీ పిలిచి ఒక రివ్యూ మీటింగ్ తప్పనిసరిగా పెట్టాలని సూచిస్తున్నా` అని మంత్రి పొంగులేటిని ఉద్దేశించి అన్నారు.

## ఆందోళన చెందొద్దు.. నిల్వలున్నాయి.. ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

* **అయినా భయాందోళనలోనే ప్రజలు**
* **పెట్రోలు బంకులు, గ్యాస్ గోదాంల వద్ద బారులు**



పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ సంక్షోభం తగ్గుముఖం పట్టినా దేశంలో ఆ వేడి మాత్రం చల్లారడం లేదు. ఒకవైపు ప్రజలు ఆందోళన చెందొద్దని, తగిన నిల్వలున్నాయని కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులు స్పష్టంగా ప్రకటిస్తున్నప్పటికీ, ప్రజల్లో మాత్రం భయాందోళనలు తగ్గడం లేదు. ఒక వైపు వారం దాటినా బుక్ చేసిన గ్యాస్ సిలెండర్ ఇంటికి రాకపోవడం, మరోవైపు కొన్ని పెట్రోల్ బంకులు మూతపడడం, నో స్టాక్ బోర్డులు పెట్టడంతో మిగిలిన పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాంల వద్ద ప్రజలు బారులు తీరారు. పనులన్నీ మానుకుని బంకుల వద్దే పడిగాపులు పడాల్సి వస్తోందని సగటు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎలాంటి అంతరాయం లేదు: కేంద్రం**

అవసరమైన వారికి గ్యాస్ అందుబాటులో ఉండేలా చేయడంతో పాటు సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల మధ్య కూడా దేశంలో గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని, వినియోగదారుల అవసరాలను తీర్చేందుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పని చేస్తున్నాయని స్పష్టం చేశారు. దేశంలో ఎలాంటి చమురు ఉత్పత్తుల కొరత లేదని పునరుద్ఘాటించారు. ఎల్‌పీజీ రీఫిల్ బుకింగ్ వ్యవధి పెంపు వార్తలు వచ్చినప్పటికీ దానిని కేంద్రం ఖండించింది. ఇంకోవైపు పైప్డ్ నేచురల్ గ్యాస్ (PNG) అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులు ఆ కనెక్షన్‌కు మారాలని కేంద్రం ఆదేశించింది. పీఎన్‌జీ అందుబాటులో ఉన్నా మూడు నెలల్లో తమ కనెక్షన్‌ను మార్చుకోకపోతే ఎల్‌పీజీ సిలిండర్ సరఫరాను నిలిపివేస్తామని స్పష్టం చేసింది.

* **ప్యానిక్ బయ్యింగ్ వద్దు: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి**

రాష్ట్రంలో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి ఎలాంటి కొరత లేదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు ప్యానిక్ బయ్యింగ్‌ను నివారించాలని సూచించారు. రాష్ట్రంలో మూడు నెలలకు సరిపడా నిల్వల కంటే ఎక్కువే ఉన్నాయని చెప్పారు. అనవసరమైన పుకార్లు వ్యాప్తి చేయకూడదని కోరారు. కరోనా లాంటి పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యల వల్లే ప్రజలంతా ఒకేసారి ప్యానిక్ అయిపోయారని, అందుకే పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ రాష్ట్రంలో ఇంధన కొరత లేదని స్పష్టం చేసింది. తప్పుడు కథనాలను ప్రజలు నమ్మొద్దని సూచించింది. కంపెనీల వద్ద సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. విపరీతమైన రద్దీ కారణంగానే కొన్ని బంకుల్లో షార్టేజ్ వచ్చిందని.. దీన్ని ఇంధన కొరతగా భావించొద్దని తెలిపింది. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలను నమ్మి ప్రజలు భయాందోళనకు గురికావొద్దని సూచించింది.

## హైదరాబాద్‌లో ఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్




హైదరాబాద్: పెట్రోలు, డీజిల్ కొరత వార్తల నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. నగర పరిధిలోని మెట్రో ఏసీ, డీలక్స్ బస్సుల్లో 30 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 'పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ.. ఆర్టీసీ బస్సులు ఉండగా' అని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి పేర్కొన్నారు. బంకుల వద్ద బారులు తీరొద్దని, సురక్షితంగా బస్సులో ప్రయాణించాలని సూచించారు.

## హైదరాబాద్‌లో 70 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

హైదరాబాద్: నగరంలోని అత్తాపూర్‌లో నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠా గుట్టు రట్టయింది. డెక్కన్ ట్రేడర్స్ గోదాములపై పోలీసులు దాడులు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. 70 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదకర రసాయనాలతో తయారు చేస్తున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్) బృందం, ఫుడ్ అడల్టరేషన్ (ఆహార కల్తీ నియంత్రణ) విభాగం అధికారులు కలిసి ఈ తనిఖీలు చేశారు. నిందితులు ముగ్గురు కలిసి ఎం.ఎం.పహాడీలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో గోదాంలను నడుపుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించడం కోసం శాంటిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్, వెల్లుల్లి పొట్టును కలిపి నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నారు. ఈ తయారీ ప్రక్రియ అత్యంత అపరిశుభ్రంగా, ఈగలు, దుమ్ము ధూళి మధ్య జరుగుతోంది. ఇలా తయారు చేసిన ప్రమాదకరమైన పేస్ట్‌ను



ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి.. హైదరాబాద్ నగరంలోని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు.

* **కుళ్లిపోయిన కోడిగుడ్లతో పిల్లల తినుబండారాల తయారీ**

మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కాటెదాన్‌లోని ఒక అక్రమ ఆహార తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఇంద్ర సొసైటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు వాడుతూ పిల్లలు తినే డోనట్ బన్స్, కేకులు తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. కుళ్లిపోయిన కోడిగుడ్లు, ప్రమాదకర రసాయనాలను గుర్తించారు.

## డోర్నకల్ గద్వాల కొత్త రైల్వేలైన్ సర్వే పూర్తి: అశ్వినీ వైష్ణవ్

ఢిల్లీ: డోర్నకల్ గద్వాల మధ్య ప్రతిపాదించిన 296 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించిన సర్వే పూర్తయినట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నాగర్‌కర్నూలు ఎంపీ మల్లు రవి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో ఈ మేరకు సమాధానం ఇచ్చారు. డీపీఆర్ తయారీ కోసం నిర్వహించిన సర్వే ప్రకారం ఈ లైన్.. సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్ కర్నూలు, వనపర్తి మీదుగా సాగుతుందని చెప్పారు. డీపీఆర్ తయారీ తర్వాత రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, నీతి ఆయోగ్, ఆర్థిక శాఖలతో సంప్రదించిన అనంతరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని వెల్లడించారు. జడ్చర్ల నంద్యాల మధ్య 182 కిలోమీటర్ల కొత్తలైన్ నిర్మాణం కోసం సర్వే పూర్తి చేశామని, అయితే ఇందులో ట్రాఫిక్ తక్కువగా ఉంటుందని తేలిందని చెప్పారు. 2022-23 నుంచి 2025-26 మధ్య కాలంలో తెలంగాణలో 18 కొత్త లైన్లు, 39 డబ్లింగ్ పనులకు సంబంధించిన సర్వే పనులు మంజూరు చేసినట్లు చెప్పారు. వీటి మొత్తం పరిమాణం 5,665 కిలోమీటర్ల మేర ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమైన కొన్ని రైల్వే ప్రాజెక్టుల పూర్తికి 2,343 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా ఇప్పటివరకు 1,580 హెక్టార్లు (67%) సేకరించామని, ఇంకా 764 హెక్టార్లు (33%) సేకరించాల్సి ఉందని చెప్పారు.

# పాక్ మాదిరి 'దళారీ'గా వ్యవహరించలేం - జైశంకర్



పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ.. అమెరికా ఇరాన్‌ల మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఇదే అంశం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందిస్తూ.. పాక్ చేస్తున్న ప్రయత్నాల్లో కొత్తేమీ లేదని, 1981 నుంచి ఆ దేశాన్ని అమెరికా ఉపయోగించుకుంటోందని చెప్పినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ మధ్యవర్తిత్వం వహించదని స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

**ఇంధన భద్రతకు ధోకా లేదు..**

దేశ ఇంధన భద్రతకు ఎటువంటి ధోకా లేదని, మనకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఇంధన సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు వీలుగా వివిధ దేశాల నుంచి దిగుమతి కోసం సంప్రదింపులు కొనసాగిస్తూనే ఉన్నామని పేర్కొంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్‌లు కూడా చేసుకున్నట్లు తెలిపింది. ఎల్‌పీజీ లభ్యత, హర్మూజ్ జలసంధి నుంచి సరుకు రవాణాపై విపక్షాలు లేవనెత్తిన ఆందోళనలపై స్పందిస్తూ.. మరిన్ని నౌకలు మార్గమధ్యలో ఉన్నాయని పేర్కొంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో ఈ భేటీ కొనసాగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు సహా పలువురు మంత్రులు పాల్గొన్నారు. కాంగ్రెస్ తరఫున తారిక్ అన్వర్, ముకుల్ వాస్నిక్ హాజరు కాగా.. సమాజ్‌వాదీ పార్టీ, బిజు జనతాదళ్‌తోపాటు పలు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, భారత్ తీసుకుంటున్న చర్యలను విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరించారు. అయితే, ఇటువంటి పరిస్థితుల్లో భారత్ మౌనంగా ఉంటోందని విపక్షాలు చేసిన ఆరోపణలకు బదులిస్తూ.. అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అయినప్పటికీ, ఈ సమావేశం నిరాశ కలిగించిందని విపక్షాలు పేర్కొన్నాయి. ఇదే అంశాన్ని ఉభయ సభల్లో చర్చించాలన్నదే విపక్షాల ప్రధాన డిమాండ్ అని కాంగ్రెస్ నేత తారిక్ అన్వర్ పేర్కొన్నారు.

## ఐఆర్‌సీటీసీలో 3కోట్ల నకిలీ ఖాతాల తొలగింపు: అశ్వినీ వైష్ణవ్



అర్హులైన ప్రయాణికులందరికీ టికెట్లు లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగానే ఐఆర్‌సీటీసీ పోర్టల్ నుంచి దాదాపు 3 కోట్ల నకిలీ ఖాతాలను తొలగించినట్టు తెలిపారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో రైల్వే టికెట్లపై అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. ''దళారుల టికెట్ల విక్రయానికి అడ్డుకట్ట వేసి.. ప్రయాణికులకు టికెట్లను అందుబాటులో ఉంచడం కోసం 3కోట్ల నకిలీ ఖాతాలను ఐఆర్‌సీటీసీ తొలగించింది. సౌకర్యవంతమైన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వం 75వేల ప్రత్యేక రైలు సర్వీసులను నడిపింది'' అని రైల్వేశాఖ మంత్రి పేర్కొన్నారు. రైలు ప్రయాణాల భద్రతపై మరింత దృష్టి సారించడం వల్ల ప్రమాదాలు 90 శాతం మేర తగ్గాయని మంత్రి చెప్పారు.

## అగ్నివీరులకు 20% రిజర్వేషన్లు కల్పించండి – కేంద్రం



అగ్నివీరులకు ఆయా విభాగాల్లో 20శాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. అగ్నివీర్ (Agniveer) తొలి బ్యాచ్ నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకొని 2027లో బయటకు రానున్న నేపథ్యంలో.. వారికి ఆయా రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు సహా పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అగ్నివీరులకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నియామకాల్లో అగ్నివీరులకు కనీసం 20శాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని సిఫార్సు చేస్తూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ రాశారు. త్రివిధ దళాల్లో పదవీ విరమణ చేసిన వారికి మాదిరిగానే అగ్నివీరులకు కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని అందులో పేర్కొన్నారు. ముఖ్యంగా ఫారెస్ట్ గార్డులు, మైనింగ్ గార్డులు, పోలీస్ కానిస్టేబుల్, ఫైర్‌మెన్, జైలు వార్డెన్లు, ప్రత్యేక పోలీస్ అధికారులు, ఎస్డీఆర్ఎఫ్ విభాగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. అగ్నివీరుల రిజర్వేషన్లకు సంబంధించి ఇప్పటికే పలు రాష్ట్రాలు చర్యలు చేపట్టాయి. పోలీస్, మైనింగ్ గార్డులు, జైలు వార్డెన్ సహా పలు విభాగాల్లో అగ్నివీరులకు ప్రాధాన్యం కల్పిస్తామని ప్రకటించిన రాష్ట్రంగా హరియాణా తొలి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు కూడా వీరికి రిజర్వేషన్‌లు కల్పిస్తామని వెల్లడించాయి. పారామిలటరీ దళాల్లో అగ్నివీరులకు రిజర్వేషన్లు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

## వార్నింగ్ ఇచ్చిన గంటలోపే.. 'అబ్రహాం లింకన్'పై ఇరాన్ దాడులు



పశ్చిమాసియా ఘర్షణల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ విమాన వాహకనౌక కదలికలను నిరంతరం పరిశీలిస్తున్నామని, లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించిన గంటలోపే దాడి చేసింది. దానికి సంబంధించిన వీడియోను ఇరాన్ మీడియా విడుదల చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ (Iran)తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులోభాగంగానే నెల రోజుల కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను ఇరాన్‌కు పాకిస్థాన్ అందించింది. ఇలాంటి సమయంలో తాజా ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై అమెరికా ఎలా స్పందిస్తుందనే దానిపై ఆందోళన నెలకొంది. అబ్రహాం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ నౌకను ఢీకొట్టాయని, దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని ఇటీవల పేర్కొంది. ఆ ప్రకటనను అప్పట్లో అమెరికా తోసిపుచ్చింది.

## క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో సత్తా చాటిన భారతీయ వర్సిటీలు!




అంతర్జాతీయ స్థాయిలో భారతీయ విద్యాసంస్థలు మరోసారి సత్తా చాటాయి. విశ్వవిద్యాలయాలకు సంబంధించి ప్రతిష్ఠాత్మక క్వాకరెల్లి సైమండ్స్ (QS) సంస్థ 'క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ బై సబ్జెక్ట్' పేరిట ర్యాంకులను విడుదల చేసింది. ఇందులో ప్రపంచంలోని టాప్ 50 వర్సిటీల జాబితాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి భారత్ నుంచి నాలుగు ఐఐటీలు, జేఎన్‌యూ, బిట్స్ పిలానీ చోటు దక్కించుకోవడం విశేషం. 100కి పైగా దేశాల్లోని 1900 వర్సిటీలకు చెందిన 21వేల అకడమిక్ ప్రోగ్రామ్‌లను.. 55 శాస్త్రీయ విభాగాలు, ఐదు ప్రధాన ఫ్యాకల్టీ విభాగాలను విశ్లేషించి ఈ ర్యాంకులను రూపొందించింది. ఇందులో ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలైన ఐఐటీ దిల్లీ, ఐఐటీ బాంబే, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ మద్రాస్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, బిట్స్‌పిలానీ చోటు దక్కించుకున్నాయి. అయితే, 2024లో భారత్ కేవలం 12 సబ్జెక్టుల్లో మాత్రమే టాప్ 50లో నిలవగా.. ఈసారి ఆ సంఖ్య 27కి చేరడం విశేషం. మినరల్ అండ్ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో ధన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ యూనివర్సిటీ 21వ ర్యాంకు సాధించింది. బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మార్కెటింగ్ ఈ రెండింటిలోనూ ఐఐఎం అహ్మదాబాద్ 21వ ర్యాంకుతో మెరిసింది.

**సత్తా చాటిన ఐఐటీ దిల్లీ**

ఈ ఎడిషన్‌లో ఐఐటీ దిల్లీ మరింత ప్రతిభను కనబరిచింది. తొలిసారిగా ఆరు ప్రధాన ఇంజినీరింగ్ సబ్జెక్టులలో టాప్ 50లో ఒకటిగా నిలిచి సత్తా చాటింది. కెమికల్ ఇంజినీరింగ్ (48వ స్థానం), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ (36), మెకానికల్, ఏరోనాటికల్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఇంజినీరింగ్ (44) ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బ్రాడ్ ఏరియా (36), కంప్యూటర్ సైన్స్ విభాగంలో 45వ స్థానంతో అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచింది.

## యుద్ధం కంచంలోకి వస్తుంది.. ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరిక

ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు హర్మూజ్‌ను మూసివేయడంతో చమురు, గ్యాస్‌తో పాటు ఎరువుల రవాణాకూ ఆటంకం ఏర్పడుతోందని ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జేన్ మేరీ పౌగమ్ పేర్కొన్నారు. యూరియా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతుండడంతో.. ఎరువుల కొరత, అధిక ధరల రూపంలో ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశముందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రపంచంలోని మూడింట ఒక వంతు ఎరువులు గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతాయి. దీని మూసివేత కొనసాగితే.. యూరియా దిగుమతి చేసుకునే వ్యవసాయ ఆధారిత దేశాల్లో నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. యుద్ధం మొదలై కొన్ని వారాలు మాత్రమే అవుతున్నందున ప్రస్తుతం ఎరువుల కొరత అంతగా లేనప్పటికీ ఈ ప్రభావం వచ్చే ఏడాది పంటలపై పడనుంది. అలా అని ప్రపంచ దేశాలు ఎరువులు, ఆహార ధాన్యాల నిల్వలు పెంచుకోవడం ప్రారంభిస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకునే పేద దేశాలు దయనీయ పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ (LNG)ని భారత్ కొన్నేళ్లుగా ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం ఆ దేశం నుంచి ఎల్ఎన్‌జీ సరఫరా నిలిచిపోయింది.



దీంతో ప్రధాన ఆహార ఎగుమతిదారులైన భారత్, థాయ్‌లాండ్, బ్రెజిల్ వంటి దేశాలలోని కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎరువుల ధరల పెరుగుదల**

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. సరఫరా కొరత కారణంగా ఇతర ఎరువుల ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఎరువులను ఎక్కువగా వినియోగించుకునే మార్కెట్లలో భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఉన్నాయి. దీంతో ఆయా దేశాలపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా కూడా యూరియాకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నప్పటికీ నత్రజనిలో సగానికి పైగా దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటుండడం వల్ల ఆ దేశంపై ఎక్కువ ప్రభావం ఉండదు.

**ఆహార ధరలు..**

ప్రపంచ మార్కెట్లో కొరత కారణంగా ఎరువుల ధరలు పెరగడంతో రైతుల ఉత్పత్తి ఖర్చులు పెరగనున్నాయి. చమురు ధరల పెరుగుదల వల్ల రైతుల రవాణా ఖర్చులపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో ప్రపంచ దేశాల్లో ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరగనున్నాయి.

## నేను బతికున్నంతవరకు ఎన్నార్సీని అనుమతించను: మమతా బెనర్జీ



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భాజపాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటరు జాబితా సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులు లాక్కోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం రాజ్యాంగ సంస్థలను వాడుకుంటున్నారన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం పాటించట్లేదని మండిపడ్డారు. ఈ రోజు ఓటుహక్కును లాక్కున్న వారు రేపు ఎన్నార్సీని తీసుకువచ్చి.. పౌరసత్వాన్ని కూడా లాక్కుంటారని దుయ్యబట్టారు. తాను ప్రాణాలతో ఉన్నంత వరకు రాష్ట్రంలో ఎన్నార్సీని అనుమతించనన్నారు. నక్సల్‌బరీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మమత ఈ వ్యాఖ్యలు చేశారు. 'సర్' పేరుతో రాష్ట్రంలోని లక్షల మంది అర్హులైన ఓటర్ల పేర్లను ఈసీ తొలగించిందని ఆమె ఆరోపించారు. దీనివల్ల అనేక మంది మైనారిటీ ఓటర్లు, వలస కార్మికులు నష్టపోయారన్నారు. ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి బెంగాల్ ప్రజలకు ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు. సర్ పని ఒత్తిడితో రాష్ట్రంలో 220 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటిపై ప్రశ్నిస్తూ బెంగాల్ ప్రజలకు తాను తోడుగా నిలబడం వల్లే తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భాజపా, ఎన్నికల కమిషన్ పని తీరుపై నమ్మకం లేదని మమత అన్నారు. నామినేషన్ వేసేందుకు వెళ్లే సమయంలో అభ్యర్థులు వారితో పాటు లాయర్లను తీసుకెళ్లి.. ప్రతి పత్రాన్ని జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.

## బెట్టింగ్ యాప్ కేసు.. బుర్జ్ ఖలీఫాలోని విల్లాను అటాచ్ చేసిన ఈడీ

దేశంలో కలకలం సృష్టించిన మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దుబాయ్‌లోని ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫాలో ఉన్న ఒక విల్లాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మహదేవ్ బెట్టింగ్ యాప్‌నకు సౌరభ్, రవి ఉప్పల్ ప్రమోటర్లుగా వ్యవహరించారు. వారిద్దరిది ఛత్తీస్‌గఢ్. ఈ యాప్‌నకు సంబంధించి మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా భారత్, దుబాయ్‌లో సౌరభ్ సంస్థలకు చెందిన రూ.1700 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. వాటిలో పలు విల్లాలు, ఖరీదైన ఇళ్లు ఉన్నాయి. అందులో కొన్ని బుర్జ్ ఖలీఫాలో కూడా ఉన్నాయి. వాటిని అటాచ్ చేసేందుకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లోని ఈడీ కార్యాలయం తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భిలాల్ ప్రాంతానికి చెందిన రవి ఉప్పల్, సౌరభ్ చంద్రఖర్ దుబాయ్ కేంద్రంగా భారత్‌లో మహదేవ్ బెట్టింగ్ యాప్ కార్యకలాపాలను నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ముసుగులో వీరు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో ఈడీ రంగంలోకి దిగింది. ఈ ప్రమోటర్లను భారత్‌కు రప్పించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. చంద్రఖర్ లొకేషన్‌ను చివరగా యూఏఈలో గుర్తించారు. రవి ఉప్పల్..యూఏఈ నుంచి వనౌటుకు పారిపోయినట్లు సమాచారం. మనీలాండరింగ్ ఆరోపణలను ఈ ఇద్దరు ప్రమోటర్లు ఖండించారు. మహదేవ్ యాప్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని, దాన్ని శుభమ్ సోని అనే వ్యక్తి నడిపించాడని చెప్పారు. మరోవైపు, ఈ బెట్టింగ్ యాప్ వ్యవహారంలో ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌పైనా ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ యాప్ ప్రమోటర్లు బఘేల్‌కు రూ.508 కోట్లు చెల్లించినట్లు గతంలో ఈడీ వెల్లడించింది.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

## సెన్సెక్స్ 1205 పాయింట్ల లాభం.. నిఫ్టీ 394 పాయింట్లు జంప్




**ముంబై:** భారతీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. వరుసగా రెండో రోజు కూడా లాభాలు పొందడం విశేషం. బుధవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1205 పాయింట్ల లాభంతో 75,273.45 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 394.05 పాయింట్ల లాభంతో 23,306.45 వద్ద ముగిసింది. సెన్సెక్స్ మంగళవారం 74,068.45 పాయింట్ల వద్ద ముగియగా, బుధవారం ఉదయం 74,652.01 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది.

ఒక దశలో 75,849.76 పాయింట్లను తాకింది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. బుధవారం అంతర్జాతీయ మార్కెట్లు కూడా లాభాల్లో కొనసాగడం భారతీయ స్టాక్ మార్కెట్‌కు కలిసొచ్చింది. అలాగే ఇరాన్-అమెరికా మధ్య చర్చలు, ట్రంప్ శాంతి ప్రతిపాదన వంటి అంశాలు కూడా మార్కెట్‌కు ఊతమిచ్చాయి. ఈ పరిణామంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పడుతున్నాయి. ఆసియా మార్కెట్లైన దక్షిణ కొరియా బెంచ్‌మార్క్ కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ సెంగ్ ఇండెక్స్ వంటివి బుధవారం లాభాల్లో ముగిశాయి. అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ షేర్లు అత్యధికంగా 4.39 శాతం లాభాలు పొందాయి. లార్సెన్ అండ్ టర్బో లిమిటెడ్ 4 శాతం, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ 3.82 శాతం, టైటాన్ కంపెనీ లిమిటెడ్ 3.50 శాతం, ట్రెంట్ లిమిటెడ్ 3.39 శాతం పెరిగాయి.

టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ, భారత్ ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు నష్టాలు చవిచూశాయి. మరోవైపు తాజా పరిణామాలతో అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ చమురు ధర 100 డాలర్ల దిగువకు చేరింది. ఈ రోజు దాదాపు 99 డాలర్ల వద్ద ఆయిల్ ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 93.96గా ఉంది. అయితే, బంగారం ధరలు మాత్రం బుధవారం పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక ఔన్స్ బంగారం ధర 4,554 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఔన్స్ వెండి ధర 72 డాలర్లకుపైగా కొనసాగుతోంది.

## రష్యా నుంచి భారత్‌కు 60 మిలియన్ బ్యారెళ్ల చమురు...

### వచ్చే నెలలో డెలివరీ




**న్యూఢిల్లీ:** భారత చమురు సంస్థలు రష్యా నుంచి సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల చమురును కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మన దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తోంది. ఇది వచ్చే నెలలో డెలివరీ కానున్నట్లు బ్లూమ్‌బర్గ్‌లో కథనం వచ్చింది.

బ్రెంట్ క్రూడ్ ధర కంటే బ్యారెల్‌కు 5 నుంచి 15 డాలర్లు అధికంగా చెల్లించి భారత రిఫైనరీలు ఈ చమురును బుక్ చేసినట్లు ఈ కథనం పేర్కొంది. ఈ మొత్తం ఫిబ్రవరిలో చేసిన చమురు కొనుగోళ్ల కంటే రెట్టింపు అని వెల్లడించింది. రష్యా చమురుపై ఉన్న ఆంక్షలను ఇటీవల అమెరికా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో తాజా కొనుగోళ్లు జరిగాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నంత కాలం రష్యా చమురుపై ఆంక్షల మినహాయింపును అమెరికా పొడిగించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. రష్యా నుంచి ఈ చమురు కొనుగోలుకు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను కూడా అమెరికా ఎత్తివేయడంతో, ఆ దేశ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

## ఎల్‌పీజీ రీఫిల్ నిబంధనల్లో మార్పులు లేవు..

### బుకింగ్‌పై వదంతులు నమ్మొద్దు: పెట్రోలియం శాఖ



**న్యూఢిల్లీ:** ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రీఫిల్ బుకింగ్ గడువును మార్చారంటూ వస్తున్న వార్తలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన, తప్పుదోవ పట్టించే కథనాలని స్పష్టం చేసింది. ఎల్‌పీజీ కనెక్షన్లకు సంబంధించి రీఫిల్ బుకింగ్ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియాలో ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు 45 రోజులు, ఇతరులకు 25 నుంచి 35 రోజుల గడువు విధించినట్టు ప్రచారం జరిగింది. ఈ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే రీఫిల్ బుకింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించింది. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాత, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల తర్వాత వినియోగదారులు మరో సిలిండర్‌ను బుక్ చేసుకోవచ్చు.

ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, అనవసరంగా ఆందోళనతో సిలిండర్లను బుక్ చేసుకోవద్దని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. దేశవ్యాప్తంగా సరిపడా ఎల్‌పీజీ నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. దేశంలోని అన్ని రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులను భారత్ పెట్రోలియం కార్పొరేషన్ కూడా ఖండించింది.

ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు చమురు, గ్యాస్, సరఫరా వ్యవస్థలపై దృష్టి సారించేందుకు కేంద్రం ఏడు ఉన్నతస్థాయి బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

# ఐపీఎల్ అభివృద్ధి అద్భుతం..



### ఎన్‌బీఏ, ప్రీమియర్ లీగ్‌లతో సమానం: సౌరవ్ గంగూలీ

ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) బ్రాండ్ విలువ ఆకాశాన్నంటుతోంది. తాజాగా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని ఏకంగా 1.63 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 15,286 కోట్లు) కొనుగోలు చేయడంపై భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆశ్చర్యం, హర్షం వ్యక్తం చేశాడు. కేవలం రెండు, మూడు నెలలు జరిగే లీగ్‌కు ఈ స్థాయి విలువ రావడం అద్భుతమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐపీఎల్ ఇప్పుడు ప్రపంచంలోని దిగ్గజ స్పోర్ట్స్ లీగ్‌లైన నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ), ఇంగ్లిష్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) సరసన నిలిచిందని ప్రశంసించాడు.

తాజాగా రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని అమెరికాకు చెందిన పారిశ్రామికవేత్త కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం సొంతం చేసుకుంది. వాల్‌మార్ట్ కుటుంబానికి చెందిన రాబ్ వాల్టన్, ఫోర్డ్ మోటార్ కంపెనీలో భాగస్వాములైన హ్యాంప్ కుటుంబం ఈ కన్సార్టియంలో భాగస్వాములుగా ఉన్నారు. ఇదే క్రమంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీని 1.78 బిలియన్ డాలర్లకు (సుమారు రూ. 16,000 కోట్లకు పైగా) అమ్ముడయింది.

ఈ పరిణామాలపై ఎన్డీటీవీ అడిగిన ప్రశ్నకు గంగూలీ స్పందిస్తూ... "2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు ఆర్సీబీ, కేకేఆర్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో మొదటి బంతిని నేనే ఎదుర్కొన్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఐపీఎల్ ఎదిగిన తీరు అసాధారణం. ఇది భారత క్రికెట్ ఎంతగా విస్తరించిందో చూపిస్తోంది. అమెరికా నుంచి కొనుగోలుదారులు రావడం, ప్రపంచవ్యాప్తంగా భారత క్రికెట్‌పై ఆసక్తి పెరగడం గొప్ప విషయం" అని అన్నాడు.

"ప్రసార హక్కుల విషయంలో ఐపీఎల్ ప్రపంచంలోని ఏ లీగ్‌కు తీసిపోదు. కొన్నిసార్లు ఈపీఎల్ మ్యాచ్ కంటే ఐపీఎల్ మ్యాచ్ ప్రసార హక్కుల విలువే ఎక్కువగా ఉంటోంది. సంవత్సరంలో కేవలం రెండున్నర, మూడు నెలలు మాత్రమే ఆడే ఒక స్పోర్ట్స్ ఫ్రాంచైజీకి ఇంత భారీ మొత్తంలో విలువ ఉండటం ఊహకు అందని విషయం" అని గంగూలీ తెలిపాడు. ఈ రికార్డు స్థాయి ఒప్పందాలు ఐపీఎల్‌ను ప్రపంచ క్రీడా వేదికపై ఒక శక్తివంతమైన లీగ్‌గా నిలబెట్టాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రపంచకప్ విజయం తర్వాత.. సింగపూర్‌లో కుటుంబంతో ఎంజాయ్ చేస్తున్న కోచ్ గౌతమ్ గంభీర్



**న్యూఢిల్లీ:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రస్తుతం కుటుంబంతో కలిసి సరదాగా గడుపుతున్నాడు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించిన తర్వాత గౌతీ విరామం తీసుకున్నాడు. సింగపూర్‌లో తన భార్య నటాషా, కుమార్తెలు అజీన్, అనైజాతో కలిసి వెకేషన్‌ను ఆస్వాదిస్తున్నాడు.

సింగపూర్ వీధుల్లో సాధారణ దుస్తుల్లో కనిపించిన గంభీర్, తన చిన్న కుమార్తెను భుజాలపై ఎక్కించుకుని నడుస్తూ కనిపించాడు.

2007లో టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో కీలక ఆటగాడిగా ఉన్న గంభీర్, ఇప్పుడు కోచ్‌గానూ కప్ సాధించి అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. రాహుల్ ద్రవిడ్, లాల్‌చంద్ రాజ్‌పుత్ తర్వాత ఈ ఘనత సాధించిన కోచ్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2024లో కోల్‌కతా నైట్ రైడర్స్‌ను ఛాంపియన్‌గా నిలిపిన తర్వాతే గౌతీ భారత జట్టు హెడ్ కోచ్‌గా నియమితులయ్యాడు.

ఇక, టీమిండియా తదుపరి సిరీస్ జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనుంది. ఈ పర్యటనలో ఒక టెస్ట్, మూడు వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు వెళ్లనుంది.

## నల్లగా ఉన్నందుకు నన్ను కాలియా అని అవమానించారు : మాజీ క్రికెటర్



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్‌లో ఒకప్పుడు అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లలో ఒకరిగా పేరుగాంచిన లెగ్ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ తన కెరీర్‌ను ప్రభావితం చేసిన కొన్ని చేదు అనుభవాలను పంచుకున్నారు. తనపై జరిగిన వర్ణ వివక్ష, జాత్యహంకార వ్యాఖ్యలు తనను మానసికంగా ఎంతగా కుంగదీశాయో తాజాగా తెలియజేశారు. ఓ జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సంచలన విషయాలను వెల్లడించారు.

స్టేడియంలో టీమిండియాకు నెట్ బౌలర్‌గా వెళ్లినప్పుడు.. స్కూల్ యూనిఫాంలో ఉన్న తనను ఓ సీనియర్ భారత బ్యాటర్ గదిలోకి పిలిచారని శివరామకృష్ణన్ తెలిపారు. గ్రౌండ్ సిబ్బందిలో ఒకడిగా భావించి, తన బూట్లు శుభ్రం చేయమని ఆ ఆటగాడు ఆదేశించాడని చెప్పారు. ఆ మాటకు నిశ్చేష్టుడైన తాను.. 'అది నా పని కాదు, మీ పని మీరు చూసుకోండి' అని బదులిచ్చినట్లు తెలిపాడు.

అప్పుడు జాతి వివక్ష అంటే ఏమిటో తెలియకపోయినా ఆ ఆటగాడి ప్రవర్తన తనను తీవ్రంగా బాధించిందని ఎల్ శివరామకృష్ణన్ అన్నారు. ఇలాంటి అవమానాలు తన కెరీర్‌లో చాలాసార్లు ఎదురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తమిళనాడు జట్టులో ఆడుతున్నప్పుడు కొందరు ప్రముఖ ఆటగాళ్లు తనను 'కరుపా (నల్లటి వాడు)' అని పిలిచేవారని చెప్పాడు. ముంబై, చండీగఢ్, జలంధర్ వంటి నగరాల్లో బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు, ప్రేక్షకులు 'కాలియా, తేరా క్యా హోగా (నల్లోడా, నీ గతేంటి)' అంటూ ఎగతాళి చేసేవారని గుర్తుచేసుకున్నాడు.

తన 17వ పుట్టినరోజున జరిగిన మరో ఘటన తనకు కన్నీళ్లు తెప్పించిందని శివరామకృష్ణన్ తెలిపారు. ఆ రోజు తన కోసం తెచ్చిన చాక్లెట్ కేక్‌ను చూపిస్తూ ఓ సీనియర్ ఆటగాడు.. 'హే సన్నీ.. నువ్వు సరైన రంగు కేకే ఆర్డర్ చేశావ్. ఇంత నల్లటి అబ్బాయికి ఇలాంటి డార్క్ చాక్లెట్ కేకే కరెక్ట్' అని ఎగతాళిగా అన్నాడని గుర్తుచేశారు. ఆ మాటలతో తాను ఏడుస్తూ కేక్ కట్ చేయడానికి నిరాకరించానని, అప్పుడు దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ తనను ఓదార్చడంతో కన్నీళ్లతోనే కేక్ కట్ చేశానని ఆనాటి బాధను పంచుకున్నాడు.

ఈ ఘటనలన్నీ తన మనసుపై చెరగని ముద్ర వేశాయని శివరామకృష్ణన్ అన్నారు. తన కెరీర్ ఆశించిన స్థాయిలో సాగకపోవడానికి ఇవి కూడా కారణమయ్యాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఆర్సీబీ ఛైర్మన్‌గా మాజీ క్రికెటర్..


### ఎవరీ ఆర్యమన్ బిర్లా?

**ముంబై:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) యాజమాన్యం చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం.. ఆర్సీబీని రూ.16,000 కోట్లకు పైగా (1.78 బిలియన్ డాలర్లు) భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. ఈ డీల్ అనంతరం ఫ్రాంచైజీకి కొత్త ఛైర్మన్‌గా ఆదిత్య బిర్లా గ్రూప్ అధినేత కుమార్ మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఈ కన్సార్టియంలో ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, డేవిడ్ బ్లిట్జర్ నేతృత్వంలోని బోల్ట్ వెంచర్స్, అమెరికాకు చెందిన బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ భాగస్వాములుగా ఉన్నాయి. ఇప్పటివరకు యూకేకు చెందిన డయాజియో పీఎల్‌సీ అనుబంధ సంస్థ అయిన యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్) చేతిలో ఉన్న ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ బృందం సొంతం చేసుకుంది. ఈ ఒప్పందంలో పురుషుల జట్టుతో పాటు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆడుతున్న మహిళల జట్టు కూడా వుంది.

ఎవరీ ఆర్యమన్ బిర్లా?

ఫ్రాంచైజీకి కొత్త బాస్‌గా రానున్న 28 ఏళ్ల ఆర్యమన్ బిర్లా గురించి ప్రస్తుతం ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఆయన కేవలం ఒక పారిశ్రామికవేత్త మాత్రమే కాదు, మాజీ క్రికెటర్ కూడా. మధ్యప్రదేశ్ తరపున దేశవాళీ క్రికెట్‌లో సత్తా చాటారు.



ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన ఆర్యమన్.. 9 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 414 పరుగులు చేశారు. ఇందులో కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్‌పై సాధించిన సెంచరీ కూడా ఉంది. ప్రస్తుత ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్, స్టార్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌తో కలిసి ఆయన డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నారు.

2018 ఐపీఎల్ మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆర్యమన్‌ను రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. అయితే, ఆ ఫ్రాంచైజీ తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. 2020 సీజన్‌కు ముందు ఆయన్ను జట్టు నుంచి విడుదల చేశారు. సరిగ్గా అదే సమయంలో 'తీవ్రమైన ఆందోళన' కారణంగా క్రికెట్‌కు తాత్కాలిక విరామం (సెబాటికల్) తీసుకుంటున్నట్లు ఆర్యమన్ ప్రకటించారు. "మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు అన్నింటికంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను" అని ఆయన అప్పట్లో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆటకు దూరమైన తర్వాత కార్పొరేట్ రంగంలోకి అడుగుపెట్టిన ఆర్యమన్, ప్రస్తుతం ఆదిత్య బిర్లా మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

ఈ కొనుగోలుపై ఆర్యమన్ బిర్లా స్పందిస్తూ... "ఆర్సీబీ తదుపరి వృద్ధి దశను నిర్మించడానికి ఈ భాగస్వామ్యంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. క్రీడలు, మీడియా, వినియోగదారుల వ్యాపారాలపై లోతైన అవగాహన ఉన్న బృందం మాది" అని తెలిపారు.



# దుల్కర్ సల్మాన్ గురించి ఆసక్తికర విషయాన్ని వెల్లడించిన శృతి హాసన్

టాకీస్: వెండితెరపై స్టార్ కిడ్స్‌గా అడుగుపెట్టిన శృతి హాసన్, దుల్కర్ సల్మాన్ తమకంటూ మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. మరోవైపు, వీరి మధ్య చిన్నప్పటి నుంచే ఒక వింతైన స్నేహం ఉందన్న విషయం తాజాగా బయటపడింది. వీరిద్దరూ చెన్నైలోని ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారన్న వార్త అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న శృతి... దుల్కర్‌తో తనకున్న స్పెషల్ మెమొరీస్‌ను పంచుకున్నారు.

తామిద్దరూ చెన్నైలోని రెండు వేర్వేరు ప్రముఖ పాఠశాలల్లో క్లాస్‌మేట్స్‌గా ఉన్నామని, స్టార్ కిడ్స్ అనే ఫీలింగ్ లేకుండా చాలా సాధారణంగా పెరిగామని శృతి చెప్పుకొచ్చారు. స్కూల్లో ఉన్నప్పుడు దుల్కర్ తనను 'సోంబి' అని పిలిచి ఆటపట్టించేవాడట. దానికి కారణం.. అప్పట్లో స్కూల్ ఫంక్షన్‌లో శృతి 'సోంబి' అనే పాటను పాడటమే. ఆ పాట విన్నప్పటి నుంచి దుల్కర్‌కు ఆమె పేరు 'సోంబి' అయిపోయింది.

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే, స్కూల్లో ఉన్న చాలామంది పిల్లలకు ఆమె పేరు శృతి అని కూడా తెలియదట. కేవలం 'కమల్ హాసన్ కూతురు' అని మాత్రమే గుర్తుంచుకునేవారని నవ్వుతూ గుర్తు చేసుకున్నారు.

చిన్నప్పుడు క్లాస్‌మేట్స్‌గా అల్లరి చేసిన ఈ ఇద్దరూ, ఇప్పుడు పవన్ సాదినేని దర్శకత్వంలో రాబోతున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో కలిసి నటించబోతున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ ప్రాజెక్టుపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. దుల్కర్ సల్మాన్ సరసన శృతి హాసన్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని సమాచారం.

### పెద్ది షూటింగ్‌లో

# రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

## భయమేమీ లేదని వెల్లడించిన చిత్రబృందం

## త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష

**టాకీస్:** మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి



27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్టైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.

# ధురంధర్-2 కలెక్షన్ల సునామీ



**టాకీస్:** బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం.

వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది.

ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.

# హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం

## రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్

**టాకీస్:** రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే.



దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో

# ఇన్‌స్టాలోకి అన్నా కొణిదెల



**టాకీస్:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఇప్పుడు సోషల్ మీడియాలోకి అడుగుపెట్టి 'అన్నా కొణిదెల'గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఖాతా ప్రారంభించగానే అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా ఆమె తొలి పోస్టు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. మొదటి పోస్ట్ సాధారణ పరిచయంకి సంబంధించింది కాగా , రెండో పోస్టులో భర్త పవన్ కళ్యాణ్‌తో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. తన బయోలో ' రష్యన్ హార్ట్ , ఇండియన్ సోల్ అని పేర్కొనడం ద్వారా తన వ్యక్తిత్వాన్ని అందంగా వ్యక్తపరిచారు అన్నా లెజినోవా. రష్యాలో జన్మించిన ఆమె, భారతీయ కుటుంబంలోకి కోడలిగా చేరిన తర్వాత రెండు సంస్కృతుల సమ్మేళనంగా జీవిస్తున్నానని తెలియజేసింది. అలాగే ప్రేమ, కృతజ్ఞతలతో జీవిస్తూ నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని కూడా తన ప్రొఫైల్‌లో తెలియజేశారు. ఇన్‌స్టాగ్రా మ్ ఎంట్రీ సందర్భంగా షేర్ చేసిన పోస్టులో, చాలా కాలంగా సోషల్ మీడియాలోకి రావాలని అనుకున్నానని, ఇప్పుడు సరైన సమయం అనిపించిందని తెలిపారు. చిరంజీవి ఆశీస్సులు, పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, ఆమె ఖాతా ప్రారంభించిన కొద్ది గంటల్లోనే ఫాలోవర్స్ సంఖ్య లక్ష దాటడం విశేషం. అన్నా కొణిదెల ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇవ్వడంతో పవన్ కళ్యాణ్ తన భార్యకు స్వాగతం పలుకుతూ ఒక పోస్ట్ చేశాడు.

# సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

## దర్శకుడు ప్రేమ్ స్పందన

టాకీస్: ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే.అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు. 'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు. ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.